# 61

# ప్రార్థన ద్వారా దేవునికి చేయబడుచున్న విన్నపము

## (యెషయా 64)

దేవుని ప్రజలు ఆయన సన్నిధి మరియు ఆయన కనికరము కొరకు ఆతురతతో ఆకాంక్షించారు. వారు ఆయన యెడల విశ్వాసఘాతకులై యుండినప్పడికిని, వారి శ్రేయస్సు నిమిత్తము తగు శ్రద్ధ వహించుటలో ఆయన వారి యెడల విశ్వసనీయమైనవాడై యుండాలని అపేక్షించారు. కాబట్టి, దేవుడు యూదాను విడిచిపెట్టకూడదని యెషయా ప్రార్థించాడు. సమస్తమును దేవుని అధికారాధీనములో ఉండినదని అంగీకరించుచూ, యెషయా ప్రజల పాపమును ఒప్పుకొన్నాడు, దేవుడు వారిని క్షమించవలెనని వేడుకొన్నాడు.

### "దేవా, దిగి రమ్ము": ఆయన సన్నిధి నిమిత్తమైన విన్నపము (64:1-4)

దేవుడు మోషేకు సీనాయి పర్వతముపై అగుపించినప్పుడు కనుపర్చినటువంటి భక్తిసంభ్రమమును గొలుపు మహిమ కార్యముల ద్వారా ఆయన తన సన్నిధిని ఇప్పుడును బయలుపర్చవలెనని ప్రవక్త తన బలమైన కోరికను దేవుని యెదుట వ్యక్తంచేస్తున్నాడు (నిర్గమకాండము 20:16, 18; 24:16, 17). దేవుని ప్రత్యక్షతలు అద్వితీయమైనవై యుండినవి. ఇంతటి ఆశ్చర్యకార్యములు చేయు దైవము గూర్చి ఇతరమైన ఏ దేశమును అతిశయింపలేకపోయింది.

గగనము చీల్చుకొని నీవు దిగివచ్చెదవు గాక
నీ సన్నిధిని పర్వతములు తత్తరిల్లును గాక.
నీ శత్రువులకు నీ నామమును తెలియజేయుటకై
అగ్ని గచ్చపొదలను కాల్చురీతిగాను
అగ్ని నీళ్లను పొంగజేయురీతిగాను
నీవు దిగివచ్చెదవు గాక.
జరుగునని మేమనుకొనని భయంకరమైన క్రియలు
   నీవు చేయగా
అన్యజనులు నీ సన్నిధిని కలవరపడుదురు గాక
నీవు దిగివచ్చెదవు గాక
నీ సన్నిధిని పర్వతములు తత్తరిల్లునుగాక.
తమకొరకు కనిపెట్టువాని విషయమై నీవు తప్ప
తన కార్యము సఫలముచేయు మరి ఏ దేవునిని
ఎవడు నేకాలమున చూచియుండలేదు
అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు
   వినబడలేదు
అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు.

వాస్తవానికి, హెబ్రీ బైబిలులో 64వ అధ్యాయంలోని మొదటి వచనము 63వ అధ్యాయంలోని చివరి వచనమై యున్నది. ఈ వచనమును మొదలుపెట్టుచున్న అవ్యయము (అనుబంధబాగము) *lu'* అను పదమునకు గతించిన ప్రస్తావన: "ఓహూ, నీవు ... . యుంటే ..."[1] అనునది అవసరమైయున్నదని జే. అలెక్ మోటెయెర్ సూచించాడు. ఇశ్రాయేలు గతంలో అనుభవించిన విషాదాంతమైన విషయము గూర్చి యెషయా మరలా చెప్పుచుండెను, ప్రజలు దేవునికి లోబడి "యుండినట్లయితే" అట్టి అనుభవము చాలా భిన్నమైనదిగా ఉండేది (48:18). వారు పయనించుచుండిన ప్రతి నిమిషం దేవుని "సన్నిధి" వారితో కూడ ఉండినది; విషయమేమనగా వారే, తిరుగుబాటుతనముతో, దేవుని నుండి తమ్మునుతాము అన్యాక్రాంతము చేసికొన్నారు. (59:1, 2 చూడుము.)

దేవుని సన్నిధి దహించు అగ్నితో పోల్చబడింది (వచనం 2), ఇట్టి అలంకారము యెషయా గ్రంథంలో తరుచుగా ఉపయోగింపబడింది. ఈ అలంకారం దేవుని కాపుదలను లేదా ఆయన తీర్పును సూచించవచ్చును.[2]

దేవుని సంబోధిస్తూ, "జరుగునని మేమనుకొనని భయంకరమైన క్రియలు నీవు చేసావు" అను ఒక సందర్భాన్ని యెషయా ప్రస్తావించాడు (వచనం 3). ఈ ప్రస్తాపన ఇశ్రాయేలు నిర్గమములో దేవుడు చేసిన శక్తిమంతమైన కార్యముల గూర్చినదై యున్నది. దేవుడిచ్చిన ఆజ్ఞలను తీసికొనుటకు ఆయన మోషేను పర్వత శిఖరము మీదికి రమ్మని పిలిచినప్పుడు సీయోను పర్వతము "మిక్కిలి కంపించినది" (నిర్గమకాండము 19:18). దేవుడు వారి పక్షముగా చేయుచుండిన ఇటువంటి కార్యములను వీక్షించవలెనని ప్రజలు ప్రగాఢంగా వాంఛించారు. "తన కొరకు కనిపెట్టువాని విషయమై నీవు తప్ప తన కార్యము సఫలముచేయు మరి ఏ దేవునిని ఎవడు ఏకాలము చూచియుండలేదు" (వచనం 4ఎ) అని ప్రవక్త పలికాడు. "చరిత్రగాని ... ఏ ప్రత్యక్షీకరణముగాని ... గోచరమైనదేదైనను ... ఇతరమైన ఏ దేవుని గూర్చియైనను తెలుపలేదు."[3] నిజమైన దేవుడుగాక "అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు వినబడలేదు. అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు" (వచనం 4బి). దేవుని కొరకు "కనిపెట్టుకొని యుండుట" అనగా మనలను మనము దేవునికి సంపూర్ణముగా సమర్పించుకొని జీవితకాలమంతయును బద్ధులమై యుండునట్లు మనలను అనుమతించునటువంటి నమ్మకము కలిగియుండుట అను భావము ధ్వనించుచున్నది.[4] అనగా మన సొంతం కంటే "దేవుని కార్యక్రమ వివరణ పట్టిక"తో సంతృప్తిచెంది యుండుట యని అర్థము.

### "దేవా, మేము పాపము చేసియున్నాము": వారి పాపముల ఒప్పుకోలు (64:5-7)

నీ మార్గములనుబట్టి నిన్ను జ్ఞాపకము చేసికొనుచు
సంతోషముగా నీతి ననుసరించువారిని నీవు దర్శించుచున్నావు.
చిత్తగించుము నీవు కోపపడితివి, మేము పాపులమైతిమి
బహుకాలమునుండి పాపములలో పడియున్నాము
రక్షణ మాకు కలుగునా?
మేమందరము అపవిత్రులవంటివారమైతిమి
మా నీతి క్రియలన్నియు మురికిగుడ్డవలె నాయెను
మేమందరము ఆకువలె వాడిపోతిమి

గాలివాన కొట్టుకొనిపోవునట్లుగా
మా దోషములు మమ్మును కొట్టుకొనిపోయెను
నీ నామమునుబట్టి మొఱ్ఱపెట్టువాడొకడును లేక
    పోయెను
నిన్ను ఆధారము చేసికొనుటకై
తన్ను తాను ప్రోత్సాహపరచుకొనువాడొకడును లేడు
నీవు మాకు ముఖము చాటు చేసికొంటివి
మా దోషములచేత నీవు మమ్మును కరిగించియున్నావు.

దేవునితో సహవాసము కలిగియుండుటకు అవసరమైయున్నదేమిటో 5-7 వచనములు తెలియజెప్పుచున్నవి. "నీ మార్గములనుబట్టి నిన్ను జ్ఞాపకము చేసికొనుచు సంతోషముగా నీతి ననుసరించువారిని నీవు దర్శించుచున్నావు" అని యెషయా చెప్పుచున్నాడు (వచనం 5). ఆయన చిత్తప్రకారము చేయువారు దేవుని సన్నిధి ప్రసన్నతను అనుభవిస్తారు. విశ్వసనీయులైన శిష్యులు దేవునితో కూడ నడచుచు ఆయన చెప్పినట్లు చేయుటలో ఆనందించుచుండగా, ఇశ్రాయేలులోని అధిక సంఖ్యాకులు దేవునికి విరోధముగా చేసిన పాపము చేత పాడైపోయి యున్నారు. "మేమందరము అపవిత్రులవంటివారమైతిమి" అని ప్రవక్త వాపోయాడు (వచనం 6ఎ). "అపవిత్రుడను" *(tame')* అనునది వీధుల గుండా వెళ్లుచుండు కుష్ఠరోగి వేయవలసిన కేకయై యుండినది (లేవీయకాండము 13:45). దేవుని ఆరాధించుచుండు సమాజముతో సహవసించుటకు అతడు తగనివాడుగా పరిగణింపబడినాడు.

"మా నీతిక్రియలన్నియు మురికిగుడ్డవలె నాయెను" అంటూ యెషయా విలపించుట కొనసాగిస్తున్నాడు (వచనం 6బి). ఈ పదబంధములో గల హెబ్రీ పదము ప్రకారము, అపరాధ భావము కలిగియుండువారు చేయు ఉత్తమమైన పనులు సహితము స్త్రీ రుతుకాలమందు స్రవించు రక్తము యొక్క డాగు పడిన గుడ్డ వంటివై యున్నవి. దేవుడు మనలను సూక్ష్మముగా పరీక్షచేసినప్పుడు, మనము జీవములేని ఆకుల వలె "వాడిపోదుము" మరియు "గాలివాన కొట్టుకొనిపోవునట్లుగా మా దోషములు మమ్మును కొట్టుకొనిపోయెను" (వచనం 6సి).

వారి చపల చిత్తమునుబట్టి క్రమరాహిత్యమైన అవిధేయత అగుపర్చిన జనము గూర్చి యోచించుచూ, "నీ నామమునుబట్టి మొర్రపెట్టువాడొకడును లేకపోయెను" అని యెషయా ఒప్పుకొన్నాడు. దేవుని నుండి యూదా దేశము అన్యాక్రాంతమగుట పూర్తియైనది. ప్రజలు చేసిన పాపములు వారిని దేవుని నుండి వేరు చేసినవి. ఈ విషయంలో తప్పు దేవునిది కాదని యెషయా స్పష్టంచేసాడు: "... *మీ దోషములు* మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు" (59:1, 2).

### "యెహోవా, నీవే మాకు తండ్రివి": దేవుని కనికరము కొరకైన కేక (64:8-12)

యెహోవా, నీవే మాకు తండ్రివి
మేము జిగటమన్ను నీవు మాకు కుమ్మరివాడవు
మేమందరము నీ చేతిపనియై యున్నాము.
యెహోవా అత్యధికముగా కోపపడకుము
మేము చేసిన దోషమును నిత్యము జ్ఞాపకము చేసికొనకుము

చిత్తగించుము, చూడుము, దయచేయుము, మేమందరము
నీ ప్రజలమే గదా.
నీ పరిశుద్ధ పట్టణములు బీటిభూములాయెను
సీయోను బీడాయెను యెరూషలేము పాడాయెను.
మా పితరులు నిన్ను కీర్తించుచుండిన మా పరిశుద్ధ మందిరము
మా శృంగారమైన మందిరము అగ్ని పాలాయెను
మాకు మనోహరములైనవన్నియు నాశనమైపోయెను.
యెహోవా, వీటిని చూచి ఊరకుందువా?
మౌనముగానుందువా?
అత్యధికముగా మమ్మును శ్రమపెట్టుదువా?

ఈ వాక్యబాగములో వ్యక్తిగతమైన నీతి లేదా యోగ్యత ఏదియును పెర్కొనబడలేదు. దానికి బదులుగా, వారిని కన్న "తండ్రి"గా దేవునిని సంబోధిస్తూ ఆయనకు చేయబడుచున్న వినయపూర్వకమైన విన్నపమును మనము చూచుచున్నాము (వచనం 8). వారిని ఆయన ఆశించు రూపములో తయారుచేయగల ఒక "కుమ్మరి"తో ఆయన పోల్చబడియున్నాడు. (ఇదే అలంకారం యిర్మీయా 18:1–6లో చూడనగును.)

9వ వచనం తుది భాగంలో అత్యవసరముగా చేయబడిన ఒక విన్నపము యివ్వబడియున్నది. "ఇదిగో, చూడుము, మేము ప్రార్థించుచున్నాము, నీ ప్రజలమే కదా - మేమందరము" అనునది దాని అక్షరార్థ అనువాదమై యున్నది. ఇదెంతో అద్భుతకరమైన ఒప్పుకోలై యున్నది.

ఇశ్రాయేలు శత్రువుల వలన దేశములోను సీయోను పర్వతముపైనను, యెరూషలేములోను కలుగజేయబడిన విధ్వంసము సుస్పష్టముగా వివరింపబడినది (వచనం 10). చివరకు మిగిలేది "బీటిభూమి" మరియు "విధ్వంసం," "... మా పరిశుద్ధ మందిరము, మా శృంగారమైన మందిరము అగ్నిపాలాయెను" అని యెషయా చెప్పుచున్నాడు (వచనం 11). లేఖనములలోని ఈ భాగమును యెషయా రచించలేదని చెప్పుటకు అనేక మంది వ్యాఖ్యానకర్తలు ఈ వాంగ్మూలమున ఒక నిదర్శనముగా పరిగణిస్తారు. ఏదిఏమైనా, ప్రేరేపింపబడిన ఒక ప్రవక్తగా, అవన్నీ అదివరకే సంభవించినట్లు సంభవింపనైయుండిన సంఘటనలను ఆయన వర్ణించగలిగాడు.[5] నిశ్చయంగా, దండెత్తి దాడి చేసిన సైన్యములచేత, ముఖ్యంగా అష్షూరు సైన్యముల చేత సాధారణంగా కలుగజేయబడిన నాశనము, వారి హస్తగతమైన పట్టణములు సర్వనాశనం చేయబడకుండా విడిచిపెట్టబడవనుటకు ఎటువంటి సందేహమైనను లేకుండాజేసినది.

సంభవింపనై యుండిన ఈ సంఘటన సమక్షంలో, "యెహోవా, వీటిని చూచి ఊరకుందువా? మౌనముగా నుందువా?" అని యెషయా దేవునిని అడుగుచున్నాడు. హెబ్రీ క్రియాపదము 63:15బి లో చెప్పబడినదే అయియున్నది, "నా యెడల నీకున్న జాలియు నీ వాత్సల్యతయు అణగిపోయెనే" అని అక్కడ వ్రాయబడియున్నట్లు మనము చూడగలము. ఇది వారిని ఎవరైనా ఆదుకొనవలెనని ఆపదలో నున్న ప్రజలు చేయుచున్న ఒక ఆర్తనాదమై యున్నది.

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 518. [2]యెషయా 4:5; 9:19; 10:16; 30:27, 30; 33:11 చూడుము. [3]Motyer, 519. [4]ఆదికాండము 49:18; కీర్తనలు 25:5, 21; 27:14; 37:7. [5]దీనిని "ప్రవచనాత్మకమైన పరిపూర్ణము" అని హెబ్రీ వ్యాకరణకర్తలు పిలుచుచున్నారు: భవిష్యత్తులో సంభవింపనై యున్నదని చెప్పుచూ అది సంభవించుట సంపూర్తియైన దాని వలె వర్ణింపబడిన ఒక సంఘటన. ప్రవచనాత్మకమైన పరిపూర్ణములకు సంబంధించిన చర్చ J. Wash Watts, *A Survey of Syntax in the Hebrew Old Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 40-43లో యీయ్యబడినది. దీనిని "ప్రవచనము యొక్క పరిపూర్ణము" అని Kyle M. Yates పిలుచుచున్నాడు. ముందుగానే తెలియజేయబడిన ఈ ప్రవచనము కచ్చితముగా నెరవేరునని ఈ వక్త కలిగియున్న (ఆత్మ) విశ్వాసమును ఈ "పరిపూర్ణము" విదితముగాను సాహసోపేతముగాను చిత్రీకరించుచున్నది. (Kyle M. Yates, *The Essentials of Biblical Hebrew,* rev. ed. John Joseph Owens [New York: Harper & Brothers, 1954], 134.)

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ కనిపెట్టుకొని యుండువారికి ❖❖❖ (అధ్యాయం 64)

యెషయా 64:5ను అనువదించుట కష్టము, మరియు దాని గూర్చిన నానా విధమైన అనువాదములు వెలువడినవి. ఏదిఏమైనా, వచనములోని తొలి భాగము అందరికి అర్థమగుచున్నదిగా ఉన్నట్లు అగుపించుచున్నది: "నీ మార్గములనుబట్టి నిన్ను జ్ఞాపకము చేసికొనుచు సంతోషముగా నీతి ననుసరించువారిని నీవు దర్శించుచున్నావు" (వచనం 5ఎ). దేవుడు "ఆయన కొరకు కనిపెట్టుకొని యుండువాని పక్షమున తన కార్యము చేయును" అని వర్ణింపబడిన వివరణ వచనం 4సి లో తెలుపడి యున్నది, ఈ రెండు ఆలోచనలను మనము ఒక్క చోట ఉంచినప్పుడు, మనము దైవ సన్నిధిలో వేచియుండుట వలన కలుగు మేలుల వేదాంతమును గూర్చిన ఒక ముక్తసరియైన సారాంశము లభించుచున్నది. ఈ సంబంధ అనుబంధములో గల చైతన్యవంతమైన శక్తుల గూర్చి ఆలోచన చేయుము.

*దేవునితో నడచుటకు దేవుని యొద్ద వేచియుండవలెను.* దేవుడు తన కార్యమును చేపట్టవలెనని ఆయనకు చేయబడుచున్న ఒక విన్నపముతో 64వ అధ్యాయం మొదలగుచున్నది: "గగనము చీల్చుకొని నీవు దిగివచ్చెదవుగాక, నీ సన్నిధిని పర్వతములు తత్తరిల్లునుగాక" (వచనం 1). దేవుని శక్తిమంతమైన హస్తము చేయు కార్యములను ఆయన ప్రజలు కొన్ని సందర్భములలో చూడలేదు. గనుక ఆయన చేయు కార్యములను సరిక్రొత్తగా చూడవలెనని వారు ఎంతో ఆతురతతో అపేక్షించుచుండిరి. దేవుడు చేయు మహత్కార్యములను చూచుటకు వారు ఆయన యొద్ద వేచియుండునట్లు వారి ఆధ్యాత్మిక పరిస్థితులు అనుకూలించినవి.

దేవుడు తన సంకల్ప ప్రకారమైన కార్యక్రమ, కాలపట్టిక మరియు ఉద్దేశముల చొప్పుననే తన కార్యములు చేయుచుండునని మనము గుర్తుంచుకొనవలెను. ఆయన చేసిన వాగ్దానములలో దేనినైనను నెరవేర్చకుండా ఎన్నడును ఉపేక్షించడు లేక ఒకరు ఆయనయందుంచిన నమ్మకమునకు నమ్మకద్రోహిగా ఎన్నడును ప్రవర్తించడు, కానీ ఆయన తన అద్భుతకార్యములను తన నీతి, ప్రణాళిక, చిత్తము, మరియు ప్రేమ యొక్క పరిధిలో చేయుచుండును.

*దేవుని కార్యములు తరుచుగా ప్రజలు పాపముల వలన తగ్గించబడుచుండును.* ఈ అధ్యాయంలో చిత్రీకరింపబడిన పరిస్థితి యిదే. పరిశుద్ధుడైన దేవుని ప్రజలు ఆయనను పరిత్యజించారు, మరియు ఆయన వారి పక్షమున తన గొప్ప శక్తిని ప్రదర్శించకుండునట్లు వారి తిరుగుబాటుతనము ఆయనను నిరోధించినది. "మేమందరము అపవిత్రులవంటివారమైతిమి, మా నీతి క్రియలన్నియు మురికిగుడ్డవలె నాయెను; మేమందరము ఆకువలె వాడిపోతిమి, గాలివాన కొట్టుకొనిపోవునట్లుగా, మా దోషములు మమ్మును కొట్టుకొనిపోయెను" అని ప్రజలందరు అంగీకరించవలసి యుండినది (వచనం 6). బహు విస్తృతమైన సాధారణీకరణముతో, యూదా ఆధ్యాత్మికముగా మృతిచెందినదని యెషయా చెప్పుచున్నాడు: "నీ నామమునుబట్టి మొఱ్ఱపెట్టువాడొకడును లేడు, నిన్ను ఆధారము చేసికొనుటకై తన్నుతాను ప్రోత్సాహపరచుకొనువాడొకడును లేడు" (వచనం 7ఎ).

అలాగైనట్లయితే, దేవుడు తన కార్యములను చేయలేదను వాస్తవమునుబట్టి అబ్బురపడాల్సిందెవరు? ఆయన యెడల విశ్వాసఘాతకులుగా నుండిన తన ప్రజలకు దేవుడు తన శక్తిమంతమును ప్రదర్శించకుండునట్లు ఆయన నీతి ఆయనను నిరోధించినది.

*దేవుని యొద్ద కనిపెట్టుకొని యుండు కాలము పశ్చాత్తాపముతోను నీతిని ప్రదర్శించుటతోను గడుపబడవలెను.* 5వ వచనం మొదటి భాగమును మరొక పర్యాయము చూడుము: "నీ మార్గములనుబట్టి నిన్ను జ్ఞాపకముచేసికొనుచు, సంతోషముగా నీతిననుసరించువారిని నీవు దర్శించుచున్నావు." వాస్తవమునకు, ఈ అధ్యాయమంతా ఒప్పుకోలు స్ఫూర్తిని మరియు విరిగినలిగిన మనస్సును మనముందుంచుచున్నది. "నీవు మాకు ముఖము చాటు చేసికొంటివి, మా దోషముల చేత నీవు మమ్మును కరిగించియున్నావు" అని గ్రంథకర్త చెప్పుచున్నాడు (వచనం 7బి). ఇంకా, "యెహోవా, అత్యధికముగా కోపపడకుము, మేము చేసిన దోషమును నిత్యము జ్ఞాపకము చేసికొనకుము" అని కూడ చెప్పుచున్నాడు (వచనం 9ఎ).

మనము దేవుని కొరకు కనిపెట్టుకొని యుండవలెనని చెప్పుటకు దేవుడిచ్చు హేతువులున్నవి. మనము, ఆయనను నమ్ముకొనియున్న పిల్లలము, ఆయన కార్యములను మనకై మనము సొంతంగా ఊహించుకొనుటకు ప్రయత్నించకూడదు. కానీ మనము కనిపెట్టుకొనియుంటూ, ఆధ్యాత్మిక రూపము దాల్చుటలోను ఆధ్యాత్మికంగా సంస్కరింపబడుటలోను మనము నిమగ్నమై యుండవలెను. తమ్మునుతాము దేవునికి నిబద్ధతగలవారై యుండుటకు తన ప్రజలు చేసికొను పునఃసమర్పణను దేవుడు ఎల్లప్పుడు ఆహ్వానించును.

*ఆయన తన నిర్ణీత సమయంలోను తన సొంత విధానంలోను, దేవుడు తన కార్యములను చేయుననునది నిశ్చయము.* దేవుని కొరకు కనిపెట్టుకొని యుండువారు నిరర్థకంగా కనిపెట్టుకొనరు. ఈ అధ్యాయం ఏదో ఒక గొప్ప విపత్తు, బహుశా యెరూషలేము పతనము చుట్టూర తిరుగుచుండవచ్చును. ఆ సంగతి మనకు తెలియపరచలేదు, కానీ

"మా పితరులు నిన్ను కీర్తించుచుండిన మా పరిశుద్ధ మందిరము, మా శృంగారమైన మందిరము అగ్ని పాలాయెను; మాకు మనోహరములైనవన్నియు నాశనమైపోయెను" అని గ్రంథకర్త చెప్పియున్నాడు (వచనం 11). దుర్భర దుర్ఘటన వారి మీదికి వచ్చి పడుచుండగా వారు చూచుచుండిరి. "దేవుడు మమ్ములను మర్చిపోవునా?" అని వారు తమ్మునుతాము ప్రశ్నించుకొన్నారు. "లేదు, నిజముగా మర్చిపోడు!" అనునది దీనికి నిశ్చయాత్మకముతో ప్రతిధ్వనించు ప్రత్యుత్తరమై యున్నది.

దేవుడు వాగ్దానములిచ్చియున్నాడు, గనుక ఆయన తన మాట తప్పడు. ఆయన యొక్క విశ్వసనీయత మాత్రమే మనమెరిగిన నిశ్చయతమై యున్నది. దేవుడు తన కార్యమును చేస్తాడా లేదా అనునది వాక్యాలంకారమైన ప్రశ్న మాత్రమే యని ఆయన కొరకు కనిపెట్టుకొని యుండువారు గ్రహిస్తారు. ఆయన తప్పనిసరిగా తన కార్యమును చేయును; ఎట్టకేలకు, ఆయన చిత్తమునకు అనుకూలంగా ఉత్తమమైనదైయున్న సమయంలో, ఆయన నీతి నెరవేరుటకు సామరస్యంగా ఉండు సమయంలో, ఆయన తన కార్యమును చేయును.

అలాగైతే, మనము దేవుని కొరకు ఏ విధంగా కనిపెట్టుకొని యుండగలము? ఆయన యొక్క మంచితనము మరియు విశ్వసనీయతలో గల నమ్మకముతో మనము ఆయన కొరకు కనిపెట్టుకొని యుండగలము. ఆయన నీతిలో ఎదుగుట ద్వారా మనము ఆయన కొరకు వేచియుండు సమయాన్ని సద్వినియోగపర్చుకొందము. ఈ ఎదుగుదలలో మన వ్యక్తిగత మరియు మన దేశము/జనము యొక్క పాపముల ఒప్పుకోలు ఇమిడి యున్నవి. సమస్త సమయము మరియు మన కాలగతులు ఆయన వశములో ఉన్నాయను ఎరుకతో, ఆయన తన కార్యమును చేయునను అచంచల విశ్వాసముతో మనము వేచియుందుము. మనము జిగట మన్నెయున్నాము, ఆయన కుమ్మరియై యున్నాడు. "గగనము చీల్చుకొని నీవు దిగి రమ్ము" అని మనము ప్రార్థించుచున్నాము, కానీ నీతిని జరిగించుచు ఆయన మార్గములను జ్ఞాపకము చేసికొనుటలో ఆనందించుచుండువారికి ఆయన ప్రత్యుత్తరమిచ్చునను గ్రహింపుతో మనము ఈ ప్రార్థనకు జవాబును వెదకుచున్నాము.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ దేవాలయము యొక్క నాశనము ❖❖❖
### (63:18; 64:11)

దేవలయము యొక్క నాశనము గూర్చిన ఒక ఉల్లేఖనము యెషయా 63:18లో కలదు: "నీ పరిశుద్ధ జనులు స్వల్పకాలమే దేశమును అనుభవించిరి, మా శత్రువులు నీ పరిశుద్ధాలయమును త్రొక్కియున్నారు." ఇటువంటి ప్రకటనయే 64:11లో చేయబడి యున్నది: "మా పితరులు నిన్ను కీర్తించుచుండిన మా పరిశుద్ధ మందిరము, మా శృంగారమైన మందిరము అగ్నిపాలాయెను; మాకు మనోహరములైనవన్నియు నాశనమైపోయెను."

## ❖❖❖ ఒక ప్రార్థన ❖❖❖
## (64:8-12)

దేవుడు కుమ్మరి అని ఆయనను గూర్చియు ప్రజలు ఆయన చేతిలోనున్న జిగటమన్నని ప్రజల గూర్చియు ఒక ప్రతిరూపము 64వ అధ్యాయంలో నివేదింపబడి యున్నది. "యెహోవా, నీవే మాకు తండ్రివి, మేము జిగటమన్ను, నీవు మాకు కుమ్మరివాడవు, మేమందరము నీ చేతిపనియై యున్నాము" (వచనం 8). "నీ చిత్తంబేను - నీ చిత్తంబే, నేను మట్టిని - ఓ కుమ్మరీ!" ("Have Thine Own Way") అను సంగీతములోని మాటలు 64:8-12 ఆధారంగా రచింపబడినవే:

నీ చిత్తంబేను - నీ చిత్తంబే
నేను మట్టిని - ఓ కుమ్మరీ!
నీ కోర్కెదీర - నన్ దీర్చుమా,
నీకు లొంగెదన్ - ఓ ప్రభువా![6]

"చిత్తగించుము, చూడుము, దయచేయుము, మేమందరము నీ ప్రజలమే గదా" అని 9వ వచనం చెప్పుచున్నది. దీని ఆధారంగా, దేవుడు వారిపై ఆగ్రహము చెందుచునే యుండవద్దని లేక వారి పాపములను వారికి విరోధముగా పరిగణించవద్దని ప్రజలు ఆయనకు విన్నవించుకొన్నారు. వారి విన్నపము, లేక ప్రార్థన, దేవుడు తన మనస్సు మార్చుకొని వారిని దీవించవలెననుదై యుండినది.